క్లుప్తంగా

చేతివృత్తి దారులకు నైపుణ్య శిక్షణ

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో వివిధ రకాలైన చేతి వృత్తిదారుల(సర్వీసు ప్రొవైడర్స్ నమోదు కార్యక్రమం ఫేజ్–1)ను గుర్తించి వారికి నైపుణ్య, సాంకేతిక శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ప్లంబర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్ వంటివి మరమ్మతులు చేసేవారు, పెయింటర్, బ్యూటీ షియన్(స్త్రీ, పురుషులు) తదితరులకు తగిన నైపుణ్య, సాంకేతిక శిక్షణ, సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు జీవనోపాధి కల్పించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు శనివారం నుంచి 7వ తేదీలోగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం లోని మెప్మా విభాగం(యూనియన్ బ్యాంకు, జీఎంసీ ఎక్స్‌టెన్షన్ ఎదురు)లో తమ పేర్లు, వివరాలతో పాటు, ఆధార్ కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు కాపీ, విద్యార్హత, అనుభవ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు పాస్ బుక్, రేషన్ కార్డు, పాస్ పోర్ట్ సైజు ఫోటోలు రెండు తదితర వివరాలతో నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు సిటి మిషన్ మేనేజర్స్, మెప్మా, వి. మాధవరావు(77807 65984), ఎస్.వి.శివ నాగేశ్వరి(83098 14869), డి.పావని (83098 15289) తదితరులను సంప్రదించాలని సూచించారు.

రేపు హైందవ శంఖారావం బహిరంగ సభ



గుంటూరు మెడికల్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 5న గన్నవరం విమానాశ్రయం సమీపంలో హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తాళ్లాయపాలెం పీఠాధిపతి శివస్వామిజీ అన్నారు. శుక్రవారం గుంటూరు అరండల్‌పేటలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో దేవదాయ ధర్మాదాయ శాఖను రద్దు చేయాలని కోరారు. సమావేశంలో దర్శనపు శ్రీనివాసరావు, డాక్టర్ కల్లగంటి నాగార్జున, దావులూరి నరేంద్ర గౌతమ్, బజరంగ్ రామకృష్ణ, చిరుమామిళ్ల గోపి, పెద్దింటి కృష్ణచైతన్య, వక్కలగడ్డ రాజగోపాల్, వెంకట్ పాల్గొన్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను శుక్రవారం వీసీ ఆచార్య కె.గంగాధరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదస్సు డైరెక్టర్ ఆచార్య ఎం.త్రిమూర్తిరావు మాట్లాడుతూ 'భారతదేశంలో మహిళల విద్య, సాధికారత పెంపునకు మహాత్మా జ్యోతిరావు పూలే – సావిత్రీబాయి పూలే సహకారం' అనే అంశంపై జనవరి 30– 31 తేదీలలో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సుకు దేశ వ్యాప్తంగా పలు యూనివర్సిటీలు, పూలే అధ్యయన కేంద్రాల నుంచి ప్రతినిధులు హాజరుకానున్నారని చెప్పారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ జి.సింంహాచలం, ఓఎస్‌బీ ఆచార్య ఆర్‌వీఎస్‌ఎస్ఎన్ రవికుమార్, యూజీసీ కోఆర్డినేటర్ ఆచార్య వై.అశోక్ కుమార్, ఆచార్య కె.ధనలక్ష్మి, పూలే సెంటర్ ప్రోగ్రామర్ బి.కోటి యాదవ్ పాల్గొన్నారు.

7న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

లక్ష్మీపురం: స్కీమ్ వర్కర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 7న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాను నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రాధాకృష్ణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఏఐటీయూసీ గుంటూరు జిల్లా సమితి సమావేశం జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు మాట్లాడుతూ ఈనెల 19న ఆటో కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆటో కార్మికుల గుంటూరు జిల్లా మహాసభలు జరుగుతున్నాయని, ఈ మహాసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు వుప్పాల సత్యనారాయణ, కోట మాలాద్రి, రావుల అంజిబాబు, బందెల రవికుమార్, చిన్ని సత్యనారాయణ, ఆరేటి రామారావు, ప్రభాకర్, రాజు, సురేష్ బాబు, కాయల రామారావు పాల్గొన్నారు.

నడింపల్లి అరుదైన రాజకీయవేత్త

లక్ష్మీపురం: స్వాతంత్ర్య సమర యోదుడు నడింపల్లి నరసింహారావు ఒక అరుదైన రాజకీయ వేత్త అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, మేధావుల ఫోరం కన్వీనర్ పీఎస్ మూర్తి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం గుంటూరు కేసరి నడింపల్లి నరసింహారావు జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజ్యాంగ వేదిక కన్వీనర్ అవధానుల హరి పాల్గొన్నారు.

ఈత కొలను నిలిపేశారు..!

మరమ్మతులతో కష్టాలు..
- అంచనాలు కూడా సిద్ధం చేయని వైనం
- ఇబ్బందులు పడుతున్న క్రీడాకారులు, స్విమ్మర్స్



టైల్స్ పగిలి పోయి ఉన్న స్విమ్మింగ్ పూల్

లక్ష్మీపురం: అధికారుల నిర్లక్ష్యంతో నగరవాసులకు ఆహ్లాదం కరువుతోంది. నగరంలో స్విమ్మింగ్‌కు ఆదరణ పెరిగింది. వయసుతో నిమిత్తం లేకుండా పెద్దసంఖ్యలో వస్తున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ స్విమ్మింగ్ పూల్ ప్రత్యేక స్థానం పొందింది.

వివరాలు.. గుంటూరు నగరంలోని పేరు ప్రఖ్యాతలు కలిగిన క్రీడా ప్రాంగణం బృందావన్ గార్డెన్స్‌లో ఎన్.టి.ఆర్ ఇండోర్, ఔట్ డోర్ స్టేడియం. అలాగే శ్యామలానగర్‌లో ఉన్న ఎన్.టి.ఆర్ స్విమ్మింగ్ పూల్ ఈ రెండు నగరపాలక సంస్థ ఆధీనంలో ఉంటాయి. అయితే శ్యామలానగర్‌లో ఉన్న ఈత కొలనును డిసెంబర్ 1వ తేదీ నుంచి పూర్తిగా నిలిపి వేశారు. ఈ ప్రక్రియ ప్రతి ఏడాది చలి కాలంలో నిలిపి వేసి మరమ్మతులు చేయించి మరలా నెల రోజుల తరువాత కొలనును యథావిధిగా ప్రారంభిస్తారు. అయితే ఇదే తరహాలో డిసెంబర్ 1వ తేదీన నగరపాలక సంస్థ అధికారులు స్విమ్మింగ్ పూల్‌ను పూర్తిగా నిలిపి వేసి పూల్‌లో ఉన్న నీటిని పూర్తిగా బయటకు తీసేసి ఖాళీగా చేశారు.

అధ్వానంగా పరిసరాలు..

ఈత కొలనులో ఉన్న టైల్స్, పూల్ చుట్టు ఉన్న టైల్స్, పగిలి పోయాయి. దీంతో పలు సందర్భాలలో ఈత వేసే వారి కాలికి గాయాలు అయిన సందర్భాలు ఉన్నాయి. అదే విధంగా పూల్ చుట్టు ఉన్న టైల్స్ కూడా పగిలి పోయి ఉండటంతో పలు మార్లు అధికారులకు తెలియజేసిన మెయింటెనెన్స్ సమయంలో అన్ని పనులు పూర్తి చేస్తామని బదులు ఇస్తూ వచ్చారు. ఈ మెయింటెనెన్స్ సమయం వచ్చిన ఇంత వరకు పనులే అధికారులు ప్రారంభించలేదు. అదే విధంగా పూల్ కోసం, ఫిల్టర్ అయ్యే గదులతో పాటు, స్విమ్మర్ డ్రెసింగ్ గదులు, వాష్ రూములు భరించలేని దుర్వాసన వెదజల్లుతున్నాయి. అదే విధంగా గదు స్లాబ్ పగుళ్లు వచ్చి పెచ్చులూడి కింద పడుతున్నాయి. స్విమ్మింగ్ పూల్ ప్రాంగణం అంతా పిచ్చి మొక్కలు పెరిగి పోయి విషపురుగులు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రాంగణంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు పిచ్చి మొక్కలు అల్లుకు పోయి ఉండటంతో పలు సందర్భాలలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కో రోజు పూల్‌ను నిలిపి వేయాల్సిన దుస్థితి.

క్రీడాకారులకు అవస్థలు



ఈత కొలనుకు ప్రతి రోజు సుమారు 170 మందికి పైగా ఉదయం నుంచి సాయంత్రం వరకు, మహిళలు, యువత, వృద్ధులు, క్రీడాకారులు నెలవారి, ఏడాది స్కీమ్‌లు రుసుం చెల్లించి వస్తుంటారు. మరమ్మతులు చేసేందుకు నగరపాలక సంస్థ ప్రణాళికలు రూపొందించి ఎంత ఖర్చు అవుతుందో దానికి సంబంధించి నివేదికను తయారు చేసి దానికి సంబంధించి టెండర్‌ను కూడా పిలవాల్సి ఉంది. అయితే పూల్‌ను నిలిపి వేసిన తరువాత నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాస్ డిసెంబర్ 14వ తేదీ పరిశీలించి పనులను త్వరితగతిన ప్రారంభించాల్సిందిగా ఆదేశించారు. కానీ ఇంత వరకు అంచనాలు రూపొందించిన దాఖలాలు కనిపించడం లేదు.

వచ్చే వారం నుంచి పనులు ప్రారంభిస్తాం

స్థానిక శ్యామలానగర్‌లోని ఎన్టీఆర్ స్విమ్మింగ్ పూల్ మరమ్మతులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తి అయింది. వచ్చే వారంలో పనులు ప్రారంభించి నగర ప్రజలకు త్వరతగతిన కొలనును అందుబాటులోకి తీసుకొస్తాం.

–కోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, కార్పొరేషన్



స్విమ్మింగ్ పూల్‌లో శిథిలావస్థకు చేరుకున్న వాటర్ ఫౌంటేన్

13 నుంచి 15వ తేదీ వరకు సంక్రాంతి సంబరాలు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 13, 14, 15 తేదీల్లో సంక్రాంతి సంబరాలను నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు వెల్లడించారు.బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో సంక్రాంతి సంబరాల ఏర్పాట్లపై ప్రత్యేక శుక్రవారం సమావేశం నిర్వహించారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి హాజరయ్యారు. ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలతో మూడు రోజుల పాటు సంక్రాంతి సంబరాలను నిర్వహించనున్నామని చెప్పారు. సంబరాల నిర్వహణకు అధికారులు, నగర ప్రముఖులతో నిర్వహణ కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, కార్పొరేటర్లు మానం పద్మశ్రీ, ఈరంటి వరప్రసాద్ పాల్గొన్నారు.

నేడు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ కౌన్సిల్ సమావేశం డిసెంబర్ 20న వాయిదా పడిన విషయం తెలిసిందే. కొనసాగింపుగా ఉదయం 10.30 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశ మందిరంలో నిర్వహించనున్న సమావేశానికి నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు అధ్యక్షత వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఐకాన్ సింబల్‌గా పీవీకే నాయుడు మార్కెట్

కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే గల్లా మాధవి



మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, వేదికపై ఎమ్మెల్యే గల్లా మాధవి

నెహ్రూనగర్: గుంటూరు నగరానికి ఐకాన్ సింబల్‌గా పీవీకే నాయుడు మార్కెట్ నిర్మాణం చేయనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో పీవీకే నాయుడు మార్కెట్ నిర్మాణంపై మార్కెట్ వ్యాపారుల సంఘ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి హాజరయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో పీవీకే నాయుడు మార్కెట్ సుమారు రూ.152 కోట్లతో 8 అంతస్తులుగా నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తి చేసినట్లు చెప్పారు. అతి త్వరలో పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మార్కెట్ నూతన భవనంలో గ్రౌండ్, మొదటి అంతస్తుల్లో సుమారు 307 మందికి స్టాల్స్ కేటాయించవచ్చని, వ్యాపారస్తుల సంఘ ప్రతినిధుల వినతి మేరకు ప్రస్తుతం ఉన్న 374 మందికి స్టాల్స్ కేటాయించడానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. నగరపాలక సంస్థ అధికారులు, వ్యాపారస్తుల సంఘ ప్రతినిధులతో మార్కెట్ నిర్మాణ పనుల పర్యవేక్షణకు కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. వ్యాపారస్తులు ఏ విధమైన ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిర్మాణ సమయంలో వారు వ్యాపారాలు చేసుకోవడానికి వీలుగా ప్రత్యామ్నాయ స్థల సేకరణ చేస్తున్నామని హామీ ఇచ్చారు. పశ్చిమ ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరికీ ఆమోదయోగ్యంగా, గుంటూరు నగరానికి మణిహారంగా పీవీకే నాయుడు మార్కెట్ నిర్మాణం జరుగుతుందని చెప్పారు. ప్రస్తుతం వ్యాపారం చేస్తున్న ప్రతి ఒక్కరికీ నూతన భవనంలో పారదర్శకంగా షాపు కేటాయింపు ఉంటుందని హామీ ఇచ్చారు. పనులు ప్రారంభించిన రెండేళ్లలో పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైద్య అధికారులపై ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ఆగ్రహం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్, గుంటూరు వైద్య కళాశాల వైద్య అధికారులపై గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ శుక్రవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య కళాశాలలో 1999 బ్యాచ్ వైద్య విద్యార్థులు రూ.80 లక్షలతో విరాళంగా అందజేసిన రెండు బస్సులను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌ను కూడా ఆహ్వానించారు. ఆయన వచ్చేంత వరకు వేచి ఉండకుండా బస్సులు ప్రారంభించారు. మంత్రి మీడియాతో మాట్లాడుతున్న సమయానికి ఎమ్మెల్యే, వైద్య కళాశాలకు వచ్చారు. మీడియాతో మాట్లాడేందుకు ముందుకు రావాలని మంత్రి కోరినప్పటికీ రాకుండా పక్కనే ఉండిపోయారు. మీడియా సమావేశం అనంతరం ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, మంత్రికి బొకే అందజేసి శాలువాకప్పి సత్కరించారు. తదుపరి తాను రాకుండానే కార్యక్రమాలు చేస్తున్నారంటూ వైద్య అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెలలో గుంటూరు జీజీహెచ్‌లో డాక్టర్ పాదిలి ప్రసాద్ సూపర్‌స్పెషాలిటీ భవనంపై రెండంతస్తుల నిర్మాణం చేపట్టేందుకు భూమి పూజ చేశారు. ఆసమయంలో ఎమ్మెల్యే గుంటూరులో లేకుండా వేరే ప్రాంతంలో ఉన్నారు. తాను అందుబాటులో లేని సమయంలోనే జీజీహెచ్‌లో కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారంటూ ఎమ్మెల్యే కోపగించుకున్నారు. పలు మార్లు జీజీహెచ్ హెచ్‌డీఎస్ సమావేశాలు సైతం జీజీహెచ్‌లో నిర్వహించకుండా కలెక్టర్ ప్రాంగణంలో నిర్వహించడంపై సైతం ఎమ్మెల్యే గుర్రుగా ఉన్నారు.

జమిలి ఎన్నికలు సమైక్య స్ఫూర్తికి విరుద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

లక్ష్మీపురం: జమిలి ఎన్నికలు సమైక్య స్ఫూర్తి విరుద్ధమని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో జాతీయ, అంతర్జాతీయ రాజకీయాల విశ్లేషణ సభ శుక్రవారం నిర్వహించారు. జాతీయ స్థాయిలో జరిగిన 2024 సాధారణ ఎన్నికలు భారత దేశంలో సంకీర్ణ రాజకీయాల అవసరాన్ని తెలిపాయని, ఈ ఫలితాలు అర్థం చేసుకుని నరేంద్ర మోదీ ప్రభుత్వం పరిపాలన చేయాలన్నారు. ఆర్థిక సంఘం ద్వారా నిధులు కేటాయింపులో లోక్ సభ సీట్ల పెంపుదలలో జనాభా ప్రాతిపదికగా తీసుకోవడం వల్ల దక్షిణాది రాష్ట్రంలో నష్ట పోతామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏక పక్షంగా నిర్ణయాలు తీసుకోకుండా ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించాలన్నారు. ఆమెరికాలో డోనాల్డ్ ట్రంప్ విజయం ఆదేశం ఆర్థిక సంక్షోభం నుంచి బయట పడటానికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో విశ్లేషకులు మాజీ శాసన సభ్యులు లింగంశెట్టి ఈశ్వరరావు, వి.పాములరెడ్డి, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, గూడవల్ల నాగేశ్వరావు ప్రసంగించారు.

కార్మికుల జీతాలు వెంటనే పెంచాలి



నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

నెహ్రూనగర్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ నంబర్ 36 ప్రకారం వెంటనే జీతాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధ సంస్థ) ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కమిషనర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలైన కార్మికుల సమస్యలను ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్య వహించడాన్ని ఖండించారు. కార్మికులకు ఇచ్చిన హామీలైన రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా, దహన సంస్కారాలకు ఆర్థిక సహాయం పెంపు జీవోలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు పాల్గొన్నారు.

సావిత్రీ బాయి పూలే ఆలోచనలే స్ఫూర్తి

- ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి
- మహిళా ప్రగతి ప్రాంగణంలో ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు
- విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ



విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న లేళ్ల అప్పిరెడ్డి

నెహ్రూనగర్: సామాజిక రుగ్మతలు రూపుమాపి, స్త్రీ సమానత్వ సాధనకై తన జీవితాంతం పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త సావిత్రీ బాయి పూలే అని శాసనమండలి సభ్యులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు లేళ్ల అప్పిరెడ్డి కొనియాడారు. మహిళా ప్రగతి ప్రాంగణంలోని ఎస్టీ బాలికల వసతి గృహంలో స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. తొలుత సావిత్రీ బాయి పూలే చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ పూలే ఆశయ సాధనకు స్ఫూర్తి ఫౌండేషన్ కృషి చేస్తున్నట్లు చెప్పారు. భారతదేశంలో మహిళా విద్యకు పెద్దపీట వేస్తూ అట్టడుగు వర్గాలకు చెందిన స్త్రీలు చదువుకునేందుకు ఆమె పాఠశాలలు ప్రారంభించి దాని సాఫల్యం కోసం సత్యశోధక సమాజాన్ని స్థాపించిన ధీరోదాత్తురాలుగా సావిత్రి బాయి పూలే నిలిచారని కొనియాడారు. పూలే జయంతిని విద్యార్థినుల సమక్షంలో జరుపుకోవడం సంతోషించంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్లు అడకా పద్మావతి, అచ్చాల వెంకటరెడ్డి, షేక్ రోషన్, ఈచంపాటి వెంకటకృష్ణా(ఆచారి), గురవయ్య, పాపతోటి అంబేడ్కర్, దూపాటి వంశీ, పడాల సుబ్బారెడ్డి, గీతా మందిరం ఛైర్మన్ వి.రత్నప్రసాద్, ఎం.శ్రీనివాసరెడ్డి, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, బి.దేవానంద్, నూనె ఉమామహేశ్వరరెడ్డి, కాకి శ్రీను, ఎస్.వెంకటరెడ్డి, బెంజిమన్, సింగు నరసింహారావు, చల్లా కోటి, వెంకటరమణ, బాజీ, ఆలా కిరణ్, సుబ్బరాజు, రత్నకుమారి, రమణి, దుర్గ, ప్రసన్న, సుశీలరావు పాల్గొన్నారు.

విద్య ఆయుధంగా చేసుకుని ముందుకెళ్లాలి

గుంటూరు ఎడ్యుకేషన్: మహిళలు విద్యను ఆయుధంగా చేసుకుని ముందుకు వెళ్లాలని హైకోర్టు న్యాయవాది, సావిత్రీబాయి పూలే పుస్తక రచయిత బీఎం లీలాకుమారి పేర్కొన్నారు. చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా మానవత సంస్థ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎన్‌యూతో పాటు ఆర్వీఆర్ జేసీ ఇంజినీరింగ్, ప్రభుత్వ మహిళా డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకులు, ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ పాఠశాలలు, అంగన్‌వాడీలకు చెందిన 30 మందిని సత్కరించి, జ్ఞాపికలు బహూకరించారు. అనంతరం సావిత్రిబాయి విద్యావ్యాప్తికి చేసిన కృషిపై విద్యార్థినులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ కార్యదర్శి కె.సతీష్, సంయుక్త కార్యదర్శి చావా లక్ష్మి, డైరెక్టర్లు శివాజీ, మిత్ర, పి. సుధాకర్, కె. రాధాకృష్ణ, జి. లక్ష్మీనారాయణ, బీసీ నాయకుడు సీహెచ్ వాసు, జయసుధ, పాఠశాల హెచ్‌ఎం షేక్ ఎండీ ఖాసిం పాల్గొన్నారు.



అధ్యాపకులతో హైకోర్టు న్యాయవాది లీలాకుమారి, మానవత సంస్థ ప్రతినిధులు



కాకుమానువారితోటలో సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు



భీమ్ సేన సేవాదళ్ ఆధ్వర్యంలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



జ్యోతిరావుపూలే, సావిత్రీబాయి పూలే చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న భీమ్ భారత్ నాయకులు

గొప్ప సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే

నెహ్రూనగర్: గొప్ప సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే అని బహుజన మహాసభ కేంద్ర కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్ సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకుని కాకుమానువారితోట ఆమె చిత్రపటానిక పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర రజక జన సేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు, ముత్తయ్య, విజయ్ కుమారి పాల్గొన్నారు.

భీమ్ సేన సేవాదళ్ ఆధ్వర్యంలో..

అట్టడగు కులాలకు విద్యనందించిన చదువుల తల్లి సావిత్రీబాయి పూలే అని భీమ్ సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపు నీలాంబరం పేర్కొన్నారు. సావిత్రి భాయిపూలే జయంతిని పురస్కరించుకుని హిందూ కాలేజీ కూడలి వద్ద ఉన్న మహాత్మజ్యోతిరావుపూలే విగ్రహం వద్ద ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మంచాల జోసెఫ్, వాసు, దేవరాజు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలేకి భారత రత్న ఇవ్వాలి

అసమానతలు రాజ్యమేలుతున్న కాలంలో కరుడుగట్టిన బ్రాహ్మణ భావజాలానికి వ్యతిరేకంగా స్త్రీలకు విద్యా బుద్ధులు నేర్పిన మహనీయురాలు సావిత్రీ బాయి పూలే అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్ పేర్కొన్నారు. ఆమె జయంతిని పురస్కరించుకుని అరండల్‌పేటలో సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి మహిళ ఉపాధ్యాయురాలైన సావిత్రిభాయి పూలేకి భారత రత్న ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యా ఉద్యమాన్ని ప్రారంభించిన సావిత్రిబాయి పూలే

గుంటూరు ఎడ్యుకేషన్: సావిత్రీబాయి పూలే చిరస్మరణీయురాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక పేర్కొన్నారు. పాత బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం సావిత్రీ బాయి జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సాన్ని పురస్కరించుకుని సావిత్రి బాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీఈవో రేణుక మాట్లాడుతూ మహిళా విద్యాభివృద్ధి కోసం తపించిన సావిత్రీబాయి పూలే ఆమె భర్త జ్యోతిరావ్ పూలే సహకారంతో పాఠశాలల స్థాపనకు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. మహిళా విద్యకోసం కృషి చేసిన వీరిని సాంఘిక బహిష్కరణ చేసినప్పటికీ, తమ పోరాటాన్ని కొనసాగించారని అన్నారు. ప్రతి మహిళ ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి ఏ తిరుమలేష్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, హెచ్‌ఎం వసుంధర పాల్గొన్నారు.

మహిళల విద్యకు సావిత్రీబాయి పూలే కృషి

గుంటూరు మెడికల్: మహిళల విద్యకు సావిత్రిబాయి పూలే విశేష కృషి చేశారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్‌నారాయణ అన్నారు. సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా గుంటూరు నగరంలోని ఎస్‌కేబీఎం హైస్కూల్‌లో నిధి వనం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీధర్‌బాబు, సీతా రమేష్, శ్రీదేవి, పాఠశాల హెచ్‌ఎం పద్మావతి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాస రెడ్డి, కొక్కెర శ్రీనివాస యాదవ్, అనుములు ఏడుకొండలు, దేశ సత్యనారాయణ, ధార్మిక సెల్ ప్రతాప్, సుబ్బలక్ష్మి, భూలక్ష్మి పాల్గొన్నారు.

త్వరలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో త్వరలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, పారిశుద్ధ్య పనులను పిన్ పాయింట్‌గా పర్యవేక్షణ చేయనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రెటరీలతో ట్రేడ్ లైసెన్స్‌లు, పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరిగేలా వార్డు సచివాలయాల ప్రాతిపదికన 802 మైక్రో ప్యాకెట్స్‌ని రూపొందించామన్నారు. ప్రతి కార్యదర్శి తమ పరిధిలోని కార్మికులకు ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేసి, హాజరు, సెలవులు నమోదు చేయాలన్నారు. త్వరలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, ప్రతి సచివాలయం పరిధిలో జరిగే పారిశుద్ధ్య పనులను క్షుణ్ణంగా పర్యవేక్షణ చేస్తామన్నారు. సమావేశంలో సీఎంఓహెచ్ డాక్టర్ పీజే అమృతం, ఎంహెచ్ఓ రవిబాబు, బయాలజిస్ట్ మధుసూదన్, వీఏఎస్ వెంకటేశ్వర్లు, ఏఎంహెచ్ఓలు ఆనందకుమార్, రాంబాబు, శానిటరీ సూపర్వైజర్లు ఆయూబ్ ఖాన్, సోమశేఖర్, ప్రజారోగ్య విభాగ సూపరింటెండెంట్ పోలేశ్వరరావు పాల్గొన్నారు.